యూజీసీ సభ్యుడిగా సచ్చిదానంద మహంతి



రాయదుర్గం: యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) సభ్యుడిగా మూడేళ్ళ కాలపరిమితితో హెచ్‌సీయూ మాజీ ప్రొఫెసర్ సచ్చిదానంద మహంతికి అవకాశం కల్పించారు. మాజీ ప్రొఫెసర్, హెచ్‌సీయూలోని ఇంగ్లిష్ విభాగం అధిపతిగా ఆయన పనిచేశారు. భారత ప్రభుత్వం ఉన్నత విద్య మంత్రిత్వశాఖ నియమించింది. ఆయన జాతీయ, అంతర్జాతీయ అవార్డులను కూడా అందుకున్నారు. ప్రస్తుతం ఆయన పంజాబ్ యూనివర్సిటీ చండీఘడ్‌లో అరబిందో చైర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు.ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

పటాన్‌చెరు టౌన్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాటా సుధ అన్నారు. శుక్రవారం కర్దనూర్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కాటా సుధని సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత వైద్య పరీక్షలు



ఇస్నాపూర్‌లో వైద్య పరీక్ష చేస్తున్న వైద్యులు

పటాన్‌చెరు టౌన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ పటాన్‌చెరు పరిసర గ్రామాల్లో ఆరోగ్యంపై అవగాహన వారోత్సవాలను 6వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహించినట్లు సంస్థ ప్రతినిధి సాంబరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులపాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించామని తెలిపారు. శివనగర్, రాళ్లకత్వ, ఊట్ల , భానూర్, నందిగామ, వెలిమెల, రుద్రారం, ఇస్నాపూర్, ముత్తంగి, గౌతంనగర్ , బీరంగూడ, గొల్లబస్తీ, శాంతినగర్ కాలనీలలో వైద్య శిబిరాలు నిర్వహించి, దాదాపు 500 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మాత్రలు అందజేయడం జరిగిందన్నారు.

నేడు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

హాజరుకానున్న మాజీ మంత్రి హరీష్‌రావు

పటాన్‌చెరు టౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ మెదక్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి మద్దతుగా నేడు పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సాయంత్రం 4 గంటలకు పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకసభ ఎన్నికలలో వెంకట్రాంరెడ్డి విజయానికి అనుసరించాల్సిన విధి విధానాలు, ప్రచారం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డును ఆక్రమిస్తే చర్యలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు. విద్యుత్‌నగర్ కాలనీలో సుమారు 1900పైగా ఇళ్లు ఉన్నాయి. కొంత మంది ఇళ్ళ ప్రహరీ గోడ బయట ఉన్న స్థలాలను వ్యాపార స్థలాలుగా మారుస్తున్నారని పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. మరికొంత మంది ఇంటి పక్క స్థలాన్ని చిరు వ్యాపారులకు అద్దెలకు ఇస్తున్నట్లు తెలిపారు. ఇక కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల ముందు కారు షెడ్లు వేస్తున్నారు .దీనిపై ఫిర్యాదులు అందడంతో అధికారులు వారికి నోటీసులు జారీచేస్తున్నారు. అంతే కాకుండా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చి వాటిని తొలగించేందుకు సిద్ధమవుతున్నారు.

నోటీసులు జారీ చేస్తున్నాం:
సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

విద్యుత్‌నగర్ కాలనీలో రోడ్లను ఆక్రమించి వాణిజ్య సముదాయాలు, కారు షెడ్‌లు నిర్మిస్తున్నట్లు మాకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయంపై నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తాము. నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం

మద్యంమత్తులో అర్ధరాత్రి టవర్ ఎక్కి..

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో అర్ధరాత్రి ఓ వ్యక్తి టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన సంఘటన పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. డివిజన్ పరిధిలోని బండ్లగూడకు చెందిన ఖదీర్ గురువారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం చోరీ అయిందని, న్యాయం చేయాలని మద్యం మత్తులో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కిటికీకి తల కొట్టుకున్నాడు.దీంతో పోలీసులు పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ నుంచి వెళ్లిన ఖదీర్ అంబేద్కర్ చౌరస్తా సమీపంలో ఉన్న టవర్ ఎక్కాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులు, పోలీసుల సహకారంతో ఖదీర్ కిందకి వచ్చాడు.

ప్రతి రంగంలో కృత్రిమ మేధస్సుదే కీలకపాత్ర

ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: ఇంజనీరింగ్ వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని, నేటి వ్యవస్థలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాముఖ్యత చాలా పెరిగిందని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఎస్కీ ప్రాంగణంలో ఎస్కీ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ సహకారంతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్స్ ప్రాముఖ్యతపై ఒక రోజు నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు.ఈ సందర్భం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విస్తారమైన డేటాను విశ్లేషించడానికి, అల్గారిథమ్‌లను ఉపయోగించడం ద్వారా ఆధునిక యుగంలో ఔత్సాహిక ఇంజనీర్లకు కీలకమైన నైపుణ్యతతో కూడిన ఏఐ, ఎంఎల్ సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవడంలో శక్తివంతమైన పాత్రను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పోషిస్తుందన్నారు. ఫ్యూచర్లీ ఇంక్, ఫైట్ క్లబ్ సహ వ్యవస్థాపకుడు ప్రమోద్, వాల్‌మార్ట్ ల్యాబ్స్, ఫైట్ క్లబ్ నుంచి స్టాఫ్ డేలా సైంటిస్ట్, మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్ నితిన్ కిషోర్, ఏఐ యొక్క విస్తృతమైన అప్లికేషన్‌లపై తమ అనుభవాలను పంచుకున్నారు. జోగినిపల్లి భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుంచి ఏఐ, ఎంఎల్ అసోసియేట్ ప్రొఫెసర్ జే శాంతి, దుర్గాభవాని, ఎస్కీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సెల్ హెడ్ పి సాయికిషోర్ ప్రసంగించారు.

సైబర్ అలర్ట్

తక్షణ ఫిర్యాదుతోనే రికవరీ సాధ్యం



జనవరి, ఫిబ్రవరి, మార్చి 3 నెలల వ్యవధిలోనే జిల్లాలో 1058 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా అమీన్‌పూర్, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో నమోదు కాగా... మోసపోయిన వారంతా చదువుకున్న వారే కావడం గమనార్హం..

- ఈ ఏడాది జనవరి నుండి మార్చి వరకు 1058 ఫిర్యాదులు
- అత్యధికంగా అమీన్‌పూర్, పటాన్‌చెరులో..
- రూ. 9 కోట్లు పోగొట్టుకున్న బాధితులు.
- రూ.కోటి 26 లక్షలు హోల్డ్ చేసిన సైబర్ టీం


పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోవడంతో ప్రజలు లక్షల్లో నష్టపోతున్నారు. ఇటీవలే ఒకే రోజు రెండు ,మూడు కేసులు నమోదవుతుండటంతో ఆందోళన కలిగిస్తుంది. సైబర్ క్రైమ్ జరిగిన గంటల్లోనే (గోల్డెన్ అవర్) బాధితులు ముందుగా 1930కు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేయాలని జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం వారి పరిధిలోకి వచ్చే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, వారి బ్యాంక్ అకౌంట్‌లను ఫ్రీజ్ చేసి డబ్బులు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అడిషనల్ డీజీపీ షికా గోయల్ సూచనల మేరకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఇలా మోసపోతున్నవారే ఎక్కువ..

- పార్ట్ టైం జాబ్ పేరుతో టాస్కులు ఇస్తూ, నగదు ఇన్వెస్ట్ చేయిస్తూ, అధిక డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపిన ఘటనలో ఇటీవలే మోసపోయిన వారే అధికం.
- కొందరు సైబర్ నేరగాళ్లు ఏటీఎం కార్డు, డెబిట్ కార్డ్ అప్డేట్ చేయాలని వివరాలను సేకరించి వారి బ్యాంక్ ఖాతా నుండి డబ్బులను మాయం చేస్తున్నారు.
- ఫేస్ బుక్‌లో వాహనాలు, సెకండ్ హ్యాండ్ వస్తువుల ప్రకటనలకు క్లిక్ చేసి సైబర్ వలలో పడుతున్నారు.
- ఇటీవలే బీరంగూడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఫేస్‌బుక్‌లో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది, లండన్ నుండి హైదరాబాద్ వస్తున్నాను అని నమ్మించి, డబ్బు అవసరం ఉందని వచ్చాక ఇస్తానని చెప్పి నమ్మించి పలు దఫాలుగా ఉద్యోగినుండి రూ.8 లక్షలు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచే సుకుంది.
- సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా నేరాలు మాత్రం ఆగడం లేదు.

ఇటీవలే జరిగిన సంఘటనలు

- అమీన్‌పూర్ పరిధిలోని ఏఆర్ బృందావన్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గత ఏడాది డిసెంబర్ 28వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి మెసేజ్ వచ్చింది. దీంతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 21 తేదీన అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఒక ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. స్నేహితుల వద్ద తెలిసిన వారి వద్ద నగదును అప్పుగా తీసుకొని 16 దఫాలుగా రూ.72 లక్షల 90 వేలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలను ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. మోసపోయానని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- పటాన్‌చెరు మండలం ఇంద్రేశంకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి గత ఏడాది డిసెంబర్ 23వ తేదీన ట్రేడింగ్ కు సంబంధించిన మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగిని లింక్ ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశారు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. మొత్తం రూ.8 లక్షల 87 వేలు ఇన్వెస్ట్ చేశారు. తాను పెట్టిన నగదు, యాప్‌లో చూపిస్తున్న లాభాలను అడగటంలో స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



ముత్తంగి రింగ్‌రోడ్డు వద్ద ఎల్‌ఈడీ ద్వారా సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పోలీసులు సూచిస్తున్న జాగ్రత్తలు..

- అపరిచిత వ్యక్తి వాట్సప్, ఫోన్‌కాల్‌కు స్పందించకుండా ఉంటేనే మంచిది.
- తక్కువ ధరకే వస్తువులు ఇస్తామంటూ ఆన్‌లైన్‌లో పెడితే దాన్ని చూసి పరిశీలించిన తర్వాతేనే నగదు ఇవ్వాలి.
- సోషల్ నెట్వర్క్ సైట్లలో మహిళలు వ్యక్తిగత ఫొటోలు ఎవరితోను పంచుకోకపోవడమే మంచిది.
- ఉచిత వైఫై ఓపెన్ నెట్‌వర్క్ ద్వారా సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలకు లాగిన్ కావొద్దు. వీటి ద్వారా సైబర్ నేరగాళ్లు అకౌంట్ పాస్‌వర్డ్ దొంగతనం చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- చాలా వరకు సామాజిక మాధ్యమాల్లో మహిళలు తమ ఫొటోలను పెడతారు. వాటిని తస్కరించి, మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉంది. అమ్మాయిలు తమ ఫొటోలు కాకుండా ఇతర చిత్రాలు డీపీగా పెట్టుకుంటే మంచిది.

అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దు..



సాఫ్ట్‌వేర్, ప్రైవేటు ఉద్యోగులు, చదువుకున్నవారే ఎక్కువగా సైబర్ వలలో పడి మోసపోతున్నారు. అపరిచిత వ్యక్తి నుండి వచ్చే లింకులు, ఫోన్‌కాల్స్‌కు వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దు. టాస్కులు, కమిషన్ల పేరుతో వచ్చే, ఆన్‌లైన్ జాబ్‌లను నమ్మొద్దు. సైబర్ క్రైమ్‌కు గురైతే వెంటనే 1930 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. ఫ్రీజ్ చేసిన నగదును కోర్టు ద్వారా బాధితులకు అందజేస్తున్నాం.రింగ్ రోడ్డు వద్ద ఎల్‌ఈడీ తెర ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – జిల్లా సైబర్ క్రైమ్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి

శిల్పారామంలో నేడు బెంగాలీ కొత్త సంవత్సర వేడుకలు

మాదాపూర్: శిల్పారామంలో శనివారం బెంగాలీ నూతన సంవత్సరమైన పొయిలా బోయిషాక్ వేడుకను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉత్తరాన్‌బంగియా సమితి, శిల్పారామం సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. బెంగాలీ సాంప్రదాయ నృత్యం, సంగీతం, బెంగాలీ చేనేత హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. బెంగాలీ వంటలు, స్ట్రీట్‌ఫుడ్‌లను సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

యువత కోసం.. సాల్వ్ ఫర్ టుమారో..

సాక్షి,సిటీబ్యూరో: సామాజిక ప్రయోజనం కలిగిన ఆవిష్కరణలు, పర్యావరణహిత పరిష్కారాల పట్ల నగర యువతలో ఆసక్తిని ప్రోత్సహిస్తూ ప్రముఖ ఎలక్ట్రానిక్ బ్రాండ్ శామ్‌సంగ్ ఆధ్వర్యంలో ఐఐటీ ఢిల్లీ, సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖ, యునైటెడ్ నేషన్స్ ఇండియాల భాగస్వామ్యంతో సాల్వ్ ఫర్ టుమారో కార్యక్రమం ప్రారంభమైంది. దీనిలో భాగంగా 14–17ఏళ్ల మధ్య వయస్కులైన పాఠశాల విద్యార్థుల కోసం స్కూల్ ట్రాక్ విభాగం కింద సమాజం–ఆవిష్కరణ థీమ్‌ను, అదే విధంగా 18–22 మధ్య వయస్కుల కోసం యూత్ ట్రాక్ పేరిట పర్యావరణం–సస్టెయినబులిటీ థీమ్‌లను ఎంచుకుని దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. స్కూల్ ట్రాక్ విభాగంలో గెలుపొందిన బృందం రూ.25లక్షల గ్రాంట్‌ను, యూత్ ట్రాక్ విభాగంలో గెలుపొందిన బృందం రూ.50లక్షల గ్రాంట్‌ను అందుకుంటాయన్నారు. మే 31వ తేదీ వరకూ www.samsung.com /in/solvefortomorrow ద్వారా దరఖాస్తులు పంపవచ్చునని తెలియజేశారు.

17న సీతారాముల కల్యాణం

నిజాంపేట్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈ నెల 17న బాచుపల్లిలోని కేసీఆర్‌సీఆర్ హరితవనం కాలనీలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది. ఉదయం 11.36 గంటలకు కేసీఆర్‌సీఆర్ హరితవనం కాలనీలోని మార్కెట్ సెంటర్‌లో జరిగే కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



ఎమ్మెల్యేను సన్మానించిన నిర్వాహకులు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం కర్దనూరు గ్రామంలో శుక్రవారం రేణుకామాత, నాగులమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై పూజలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జీఎంఆర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పాండు, మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ కుమార్, గౌడ సంఘం సభ్యులు సుభాష్‌గౌడ్ , ప్రవీణ్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన మహిళలతో పటేల్ రమేష్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

శేరిలింగంపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ వస్తుందని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం చందానగర్, ఆల్విన్ కాలనీ డివిజన్లకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్, సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్‌లు వారిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం అన్నారు. కట్టా శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 300 మంది యువత పార్టీలో చేరగా, ఆల్విన్ కాలనీ డివిజన్‌కు చెందిన మహిళలు భారీగా చేరారు. పార్టీలో చేరిన వారిలో చంద్రశేఖర్, పవన్, విశాల్, యాదయ్య, దిలీప్, కిశోర్, సాయిరాం, సాత్విక్, డేవిడ్, ఆల్విన్ కాలనీ డివిజన్ శ్యామల, దేవీ, లలిత కుమారి, అన్నపూర్ణ, రోజా రాణి, మాలతి, పూర్ణిమ ఉన్నారు.

చలో చేవెళ్ల బహిరంగ సభను జయప్రదం చేయండి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఏప్రిల్ 13న శనివారం మధ్యాహ్నం 2 గంటలకు చేవెళ్లలో జరగనున్న సభకు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, వార్డ్ మెంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు, నాయకులు, ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలి రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



శాంతినగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని శాంతినగర్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి సతీమణి సీత రంజిత్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, శేరిలింగంపల్లి పరిశీలకులు, టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎంబీసీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ జేరిపేటి జైపాల్, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ పూజితగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ నాయకులు, అధ్యక్షులు, యువకులు, మహిళలతో కలిసి కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

రూ. 2.71 లక్షలు, 9 సెల్‌ఫోన్‌లు, 2 సెట్లు ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం

మాదాపూర్: పేకాటాడుతున్న 9 మందిని గురువారం రాత్రి మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని చంద్రనాయక్‌తండాలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో మాదాపూర్ ఎస్‌ఓటీ, పోలీసులు దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు ముద్దాల వెంకట కృష్ణారావుతో పాటు 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 2.71 లక్షల నగదు, 9 మొబైల్ ఫోన్‌లు, 2 సెట్ల ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



యాకయ్య

గచ్చిబౌలి: డ్యూటీకి వెళ్లకుండా మద్యం తాగుతూ కాలం గడుపుతున్నావంటూ భార్య మందలించడంతో మనస్తాపం చెందిన భర్త అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో నివాసం ఉండె కె.యాకయ్య(32) డీసీఎం డ్రైవర్. కొద్ది రోజులుగా డ్యూటీకి వెళ్లకుండా మద్యం తాగుతుండడంతో భార్య ధనలక్ష్మీ డ్యూటీకి వెళ్లాలని మందలించింది. గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో చెప్పాపెట్టకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో సమీప ప్రాంతాలలో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భార్య ఇచ్చిన ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంప్రదాయ.. శిల్పకళా వేదిక

- శుభకార్యాలకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే వెసులుబాటు
- మూడు హాళ్లు అందుబాటులో..



సాంప్రదాయ వేదిక



రాక్‌హైట్స్

మాదాపూర్: నగరం నడిబొడ్డున ఉన్న శిల్పారామం వివాహాది శుభకార్యాలకు అనువుగా ఉండడంతో ప్రజలు బుక్ చేసుకుంటున్నారు. హైటెక్ సిటీకి పక్కనే ఉండడం, పార్కింగ్ అందుబాటులో ఉండడంతో దీన్ని ఎంచుకుంటున్నారు. విశాలమైన స్టేజీలు, పచ్చదనం, రాక్ హైట్స్, మౌంటేన్‌హైట్స్, శిల్పకళావేదికను ఎక్కువగా బుక్ చేసుకుంటున్నారు. పెళ్లిళ్లు, రిసెప్షన్‌లు, ప్రైవేటు కార్యక్రమాలు విరివిగా చేసుకుంటున్నారు. కేవలం వివాహాది శుభకార్యాలే కాకుండా పుస్తకావిష్కరణ, వర్ధంతి, ఆడియో ఫంక్షన్, చర్చా కార్యక్రమాలను, పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సాంప్రదాయ వేదిక..

బంధుమిత్రులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యే వారు వివాహ కార్యక్రమాలను చేసుకోవడానికి సాంప్రదాయ వేదిక అనుకూలంగా ఉంటుంది. దాదాపు 2వేల మంది సిట్టింగ్ అవకాశం ఉంటుంది. దీని ధర రూ.1.60 వేలు జీఎస్టీతో కలిపి ఉంటుంది.

రాక్‌హైట్స్..

ఎక్కువగా రిసెప్షన్లు, ఆడియో ఫంక్షన్లు చేసుకునేందుకు వినియోగిస్తున్నారు. దాదాపు 800 మంది సిట్టింగ్ కెపాసిటీ ఉంది. ఓపెన్ స్థలం కావడంతో ఎక్కువగా ఇష్టపడుతున్నారు.బుక్ చేసుకునేందుకు రూ.1.28 వేలు జీఎస్టీతో కలిపి ఉంటుంది. ఎక్సైజ్ పర్మిషన్‌తో లిక్కర్ పార్టీలను కూడా నిర్వహించుకోవచ్చు.

మౌంటేన్‌హైట్స్..

ప్రత్యేకమైన స్టేజీ ఉంటుంది. చర్చా కార్యక్రమాలు, రిసెప్షన్లు నిర్వహిస్తున్నారు. దాదాపు 500 మందికి సరిపడ సిట్టింగ్ కెపాసిటీ ఉంటుంది. బుక్ చేసుకోవాలంటే రూ. 1.28 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చు.

శిల్పకళావేదిక..

సినిమా ఆడియో కార్యక్రమాలను ఎక్కువగా నిర్వహిస్తున్నారు. 2500 మందికి సిట్టింగ్ కెపాసిటీ ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకోవాలనుకుంటే రూ.1 లక్ష, జీఎస్టీ ఉంటుంది. సినిమాలు ఆడియో కార్యక్రమాలకు రూ. 10 లక్షలు . కార్యక్రమాన్ని బట్టి రేట్లు ఉంటాయి. ఇందులో కార్పొరేట్ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు నిర్వహించుకుంటున్నారు.

రెండేళ్లుగా రోడ్డు పనులు.. అవస్థలు



గుంతలు పడ్డ రోడ్డు

జిన్నారం(పటాన్‌చెరు): డబుల్‌రోడ్డు పనులు చేసేందుకు రెండేళ్లక్రితం అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు రోడ్డు పనులు సాగుతూనే ఉన్నాయి. రోడ్డు వేసేందుకు ఇరువైపులా గుంతలు తీయటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్షణమే రోడ్డు పనులను పూర్తి చేయించేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రమైన గుమ్మడిదల గ్రామం నుంచి అనంతారం మీదుగా కానుకుంట గ్రామం వరకు డబుల్ రోడ్డు వేసేందుకు రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.సుమారు రూ.9కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి.ఈ క్రమంలో రోడ్డు వేసేందుకు ఇ రువైపులా గుంతలు తీసి వదిలేయడంతో రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయి.త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో రోడ్డు పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు.

రోడ్డుపై మురుగునీరు

నిజాంపేట్: పలు ప్రధాన రహదారులు, బస్తీల్లో తరచూ డ్రైనేజీ నీరు ఏరులై పారుతోంది. 21వ డివిజన్ సాయినగర్‌లో గత పదిహేను రోజులుగా మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలు నిండిపోయి మురుగునీరు రోడ్డుపైకి పారుతోంది. దీంతో స్థానికంగా దుర్గంధం నెలకొని ప్రజలు వాసన భరించలేకపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.